క్లుప్తంగా

జిల్లా సేవాదల్ ఉపాధ్యక్షుడిగా రమణ



రమణను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: జిల్లా జగనన్న సేవాదల్ ఉపాధ్యక్షునిగా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెయ్యల రమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తన క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, పార్టీ మండల కార్యదర్శి పినిపే జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ కన్వీనర్‌గా సురేష్



ఉప్పలగుప్తం: మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ కన్వీనర్‌గా మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన గెద్దం సురేష్ బాబు నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందాయని సురేష్‌బాబు గురువారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఏఐసీసీ అధ్యక్షుడు చీకట్ల అబ్బాయి, మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు, అయితాబత్తుల సుభాషిణి, దోనిపాటి విజయలక్ష్మిలు అభినందించారు.

రేపు కూనవరంలో ఉచిత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో తోట సత్యనారాయణ జయంతి సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబీకులు గురువారం తెలిపారు. శిబిరంలో గైనకాలజీ, క్షయ, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో పాటు బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: తాళ్లరేవు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, మండల పరిషత్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ర్యాలీ



ఎదుర్లంకలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల పాస్టర్లు

ఐ.పోలవరం: మణిపూర్ ఘటనలను ఖండిస్తూ ఐ.పోలవరం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎదుర్లంక పోలీస్ స్టేషన్ నుంచి మురమళ్ల సెంటర్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో నేతల నాని, ములపర్తి సత్యనారాయణ, ప్రేమానందపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ముమ్మిడివరం: మండల పరిధిలోని గాడిలంకలో గాడా సత్యనారాయణమూర్తికి చెందిన తాటాకిల్లు, పందుల పాక గురువారం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ అధికారి కొండయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పోరు యాత్ర విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: ఐద్వా ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి ఈ నెల 8వ తేదీ వరకూ జరుగుతున్న మహిళల పోరు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. స్థానిక వడ్డిగూడెంలోని సాంఘిక సంక్షేమ మహిళా వసతి గృహంలో విద్యార్థినులతో గురువారం జరిగిన సభలో ప్రసంగించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పూర్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి, జిల్లా నాయకురాలు టి.నాగ వరలక్ష్మి తదితరులు మాట్లాడారు.

పంట నమోదుకు వేళాయె!

- ఈ–క్రాప్ వివరాల సేకరణలో వ్యవసాయ సిబ్బంది
- సదస్సుల ద్వారా రైతులకు అవగాహన



ఈ–క్రాప్ నమోదుచేస్తున్న వ్యవసాయాధికారులు

ముమ్మిడివరం: వ్యవసాయ రంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను అమలు చేస్తుంది. పెట్టుబడి సాయంతో పాటు ఆర్బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, అందజేస్తున్న ప్రభుత్వం రైతులు ఏవిధంగానూ నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ–క్రాప్ నమోదు అవకాశం కల్పించింది. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టం జరిగితే ఈ–క్రాఫ్ ఆధారంగా బాధిత రైతులకు నష్ట పరిహారం అందజేస్తుంది. ఒక్క నష్ట పరిహారమేమిటి.. ఈ–క్రాప్ చేసే మేలు అంతా ఇంతా కాదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఎన్నో లాభాలు

ఈ ఏడాది వర్షాల రాకతో పాటు ఆయకట్టు నీరు సైతం ఆలస్యం కావడంతో పంట సాగుకి సైతం జాప్యమైంది. గత రెండు వారాలుగా వర్షాలు జోరుగా పడటంతో రైతులు సాగు ముమ్మరం చేశారు. బోర్లు, ఆయకట్లు, బావుల తదితర నీటి వనరుల కింద సాగు చేసిన పంటను పకడ్బందీగా ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగవుతున్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌తో రైతులకు ఎన్నో లాభాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ–క్రాప్‌లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి భూమి సర్వే నెంబరు, రైతు వివరాలు, ఏ పంట వేశారు తదితర వివరాలన్నీ నమోదుచేసి జియో కోఆర్డినేట్స్‌తో సహా పంట ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ–క్రాప్ నమోదుతో ప్రభుత్వం నుంచి అందే ప్రతి రాయితీ రైతులకు చేరుతుంది. పండించిన పంటను అమ్ముకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయినా, ఆర్బీకేలో రాయితీపై ఎరువులు, విత్తనాలు తీసుకోవాలన్నా, పంట రుణాలు కావాలన్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందాలన్నా ఈ–క్రాప్ తప్పనిసరి. అందుకే రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదుచేయించుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



క్షేత్రస్థాయిలో పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నాం. రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాఫ్ నమోదు చేయించుకోవాలి. దీనివల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు, రాయితీలు చేకూరతాయి. ప్రత్యేక సమావేశాలు పెట్టి మరీ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.ప్రశాంతకుమార్, వ్యవసాయాధికారి, ముమ్మిడివరం మండలం

పశువులను కట్టడి చేయాలి

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి మార్కెట్ ఏరియాలో రహదారులపై సంచరిస్తున్న పశువులను మూడు రోజుల్లోగా ఆయా యజమానులు కట్టడి చేయాలని కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. పశువులు రహదారులపై సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. వాటిని కట్టడి చేయకపోతే పశువులను బంధించడమే కాకుండా వాటి యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

ప్రధానోపాధ్యాయులకు బదిలీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్) ఎఫ్‌పీ వెర్బినా జయరాజ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. డోరతీ ఫ్లోరెన్స్‌ను కామిశెట్టి ఎస్‌పీవీ ప్రభుత్వ కేంద్ర బాలుర స్కూల్‌కు, తోట వెంకన్నను డాక్టర్ జకీర్ హుస్సేన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు, ఏలూరి ధనలక్ష్మిను కురసాంపేట స్వామి వివేకానంద పాఠశాలకు, శ్రీరెడ్డిను కనకాలపేట ప్రభుత్వపాఠశాలకు, పాలిక వెంకటరమణను మెట్టకూరు మదర్‌థెరిస్సా పాఠశాలకు, బొంతు సత్యశ్రీనివాస్‌ను ఇసుకకాలువ సర్ఆర్థర్ కాటన్ ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వచ్ఛమైన తాగునీరివ్వడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



చినకొత్తలంకలో ఇంటింటికీ కుళాయి పథకానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే లక్ష్యంగా అనేక మంచినీటి పథకాలను ప్రవేశపెడుతున్నామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మండలంలోని కొత్తలంకలో రూ.1.06 కోట్లతో, చినకొత్తలంకలో రూ.42.91 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి పథకాలకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రత్యేక నిధులు సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు, కొత్తలంక సొసైటీ అధ్యక్షుడు పీటీవీ వర్మ, చినకొత్తలంక, మర్లపాలెం సర్పంచ్‌లు పొత్తూరి ఉమారాణి, విత్తనాల నాగ బ్రహ్మేశ్వరరావు, పొత్తూరి వీణారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- బండారులంకలో గడప గడపకూ



బండారులంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని బండారులంకలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలతో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందుశెట్టి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు శ్రీనివాస్, ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకిలక్ష్మి, చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సొసైటీల ద్వారా ఆర్థికాభివృద్ధి



ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సొసైటీ విధివిధానాల్ని వివరిస్తున్న రైతు నాయకులు

యానాం: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అగ్రికల్చర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సొసైటీలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో కేంద్ర ప్రభుత్వ పథకమైన ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌కు సంబంధించి విధి విధానాలు, లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా యానాంకు ఈ పథకానికి సంబంధించి గ్రూపు ఏర్పాటుకు ఎంపికయ్యిందన్నారు. ఈ పథకం ద్వారా పురుగుమందులు, ఎరువులు రాయితీపై అందిస్తారన్నారు. గ్రూపు సభ్యులకు రూ.20 లక్షల వరకూ సాయం, రూ.కోటి వరకూ వడ్డీ లేని రుణాన్ని ఇస్తారని చెప్పారు. సమావేశంలో రైతు నాయకులు మాజేటి సత్యభాస్కర్, కొండమూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు పండించవచ్చని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో పీఎంఏజేఏవై పథకం కింద షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు, పనిముట్లు అందిస్తున్నారన్నారు.

వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం



గోగుల్లంకలో వరద బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



పొన్నాడవారిగట్టులో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు



వరద బాధితులకు ప్రభుత్వ సాయం రూ.2 వేలు అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

ఐ.పోలవరం: వరద బాధితులను ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో గోగుల్లంక గ్రామంలో గురువారం ఆయన వరదల వల్ల నష్టపోయిన 432 బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లతో కూడిన కిట్లను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా వరద తగ్గిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, శ్రీకాకర్లపూడి వాసురాజు, ఢిల్లీ నారాయణ, మెండా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల అందజేత

కాట్రేనికోన: మండలంలోని కందికుప్ప పంచాయతీ పొన్నాడవారిగట్టుకు చెందిన వరద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ గురువారం నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో బాధితులకు సాయం చేయడంలో రెడ్ క్రాస్ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పిన్నమరాజు శ్రీనివాసరాజు, కాట్రేనికోన జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్, కందికుప్ప సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఏడిద సుబ్బారావు, ఏడిద లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.2 వేలు

అల్లవరం: మండలంలో వరద బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ.2 వేలు చొప్పున ప్రభుత్వ సాయంగా అందించామని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని బోడసకుర్రు పల్లిపాలెం, గోపాయిలంక, అల్లవరం బుడంపేట, కంసాలమామిడి ప్రాంతాల్లో మొత్తంగా 511 కుటుంబాలు వరద బారిన పడ్డారన్నారు. వారందరికీ కలిపి ప్రభుత్వ సాయంగా రూ.10,22,000 అందించామని చెప్పారు. అంతేకాకుండా తక్షణ సాయంగా 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలను పంపిణీ చేశామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏడు రోజుల పాటు పునరావాస కేంద్రంలో రెండు పూటలా భోజనం, అల్పాహారం అందించామని చెప్పారు. పాడి పశువులకు కోసం రైతులకు 6 టన్నుల దాణామృతం పంపిణీ చేశామన్నారు. అల్లవరం బుడంపేటలో వరద బాధితులకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి చేతుల మీదుగా ప్రభుత్వ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, ఎంపీటీసీ బస్వాని పద్మ, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఓలేటి పరమేష్, గోసంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌మెన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపకదళ శాఖలో ఫైర్‌మెన్, స్టేషన్ ఆఫీసర్ పోస్టులకు యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి నివాసిత మహిళ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ కార్యదర్శి ఎంవీ హిరాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ పోస్టులైన ఫైర్‌మెన్–58 పోస్టులు, స్టేషన్ ఆఫీసర్–5 పోస్టులకు 'recruitment.py.gov.in' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 4వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ స్వీకరిస్తారని చెప్పారు.

బీజేపీ విమర్శలు అర్థరహితం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఘటనపై బీజేపీ నాయకులు పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఆలయ మహిళా చైర్‌పర్సన్‌పై విమర్శలు చేయడం అర్థరహితమని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. విషయాన్ని మరుగున పడేసి తమ పార్టీవారిని వెనకేసుకొస్తున్న బీజేపీ నాయకుల తీరు సరైనది కాదన్నారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి ఆలయ అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని చెప్పారు. గతంలో ఏ ఆలయ చైర్మన్ ఇంతటి అభివృద్ధి చేయలేదని భక్తులు అభినందిస్తుంటే బీజేపీ నాయకులు విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు.

హెల్మెట్లు ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- సినీ హీరో సాయిధరమ్ తేజ్



అమలాపురంలో మాట్లాడుతున్న సినీ హీరో సాయిధరమ్ తేజ్

అమలాపురం టౌన్: రోడ్లపై ప్రయాణించే సమయంలో అందరూ విధిగా హెల్మెట్లు ధరించి ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవాలని సినీ హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. ×బ్రో₹ సినిమా అమలాపురంలో ప్రదర్శితమవుతున్న వెంకటరమణ థియేటర్‌కు గురువారం ఆయన వచ్చి సందడి చేశారు.

అనంతరం అభిమానులద్దేశించి సాయిధరమ్ తేజ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం తర్వాత అభిమానుల ఆశీస్సులతో మళ్లీ మీ ముందుకు వచ్చానని చెప్పారు. తొలుత సాయిధరమ్ తేజ్‌కు థియేటర్ వద్ద చిరంజీవి యువత అఖిల భారత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, రాష్ట్ర కార్యదర్శి నల్లా చిట్టిబాబు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి నల్లా నాయుడు, సాయిధరమ్ తేజ్ అభిమాన సంఘాల ప్రతినిధులు వర్రే శేషు, వాకాడ సుబ్రహ్మణ్యం, నల్లా చిన్ని తదితరులు స్వాగతం పలికారు. తమ హీరోను ఘనంగా సత్కరించి అభినందించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చి వేడుకలు జరిపారు.

రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్ష చేస్తున్న సుంకరపాలెం గ్రామస్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో ఉన్న ఊటకాలువ, భూములను ఆక్రమణల నుంచి పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు గుత్తుల నాగేశ్వరరావు, మోపూరి వెంకట రెడ్డినాయుడు, పిల్లి కొండ, పితాని పోతురాజు, పిల్లి వెంకటరమణ, పితాని పాండురంగారావు, అర్జున్ తదితరులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఊటకాలువ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 125లో ప్రభుత్వ నిషేధ భూముల్లో పలువురు అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారని , సర్పంచ్ నాగేశ్వరరావు సైతం ఆక్రమణలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావును వివరణ కోరగా తాను భూకబ్జా చేశానన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, బులినాని, కౌన్సిలర్లు



గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

అమలాపురం టౌన్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన ఆరేళ్ల లోపు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక 12, 13 వార్డులకు సంబంధించి వార్డు సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైరపర్సన్ సత్య నాగేంద్రమణి పాల్గొని ప్రసంగించారు. అనంతరం గర్భిణులకు శాస్త్రోక్తంగా శ్రీమంతం జరిగింది. గర్భిణులకు పువ్వులు, గాజులు, నూతన వస్త్రాలు, స్వీట్లు తదితర వస్తువులను పళ్లాల్లో బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంసాని బులినాని, మాజీ కౌన్సిలర్ శ్యామలాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు యండమూరి గంగ, బండారు గోవిందులు, కట్టోజు సన్న్యయ్యదాసు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం కోరంగి పంచాయతీ సీతారామపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ గతంలో కేవలం రూ.200 విలువ చేసే పోషకాహార కిట్లను మాత్రమే అందించేవారని, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.1,100 విలువ చేసే కిట్లను స్వయంగా ఇంటికి తీసుకెళ్లి అందిస్తున్నారన్నారు. ఎండు ఖర్జూరం, చిక్కీ, గుడ్లు, పాలు, రాగులు వంటి ఎంతో బలమైన పోషకాహారాన్ని ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, అంగన్‌వాడీ కోఆర్డినేటర్ ఎస్.లలితా నిర్మల, సూపర్‌వైజర్‌లు నళిని, నిభావాణి పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రేలంగి దుర్గారావు అన్నారు.

గురువారం ఇమ్మిడివరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ సందర్భంగా సర్పంచ్ రేలంగి దుర్గారావు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రేవు శ్రీనివాసరావు, కార్యదర్శి రెడ్డి శిరీష, గ్రేడ్–5 కార్యదర్శి విజయదుర్గ, మహిళా సంరక్షణ కార్యదర్శి హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయ గోదావరిలోకి ఆక్వా వ్యర్థాలు



- భరించలేని దుర్గంధంతో జనం అవస్థలు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఆత్రేయ గోదావరిలోకి కొన్ని రొయ్యల కంపెనీలు ఆక్వా వ్యర్థాలను యథేచ్ఛగా వదిలేస్తున్నాయి. దీంతో చరిత్ర ప్రసిద్ధిగాంచిన కోరంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. నది చెంతన ఉన్న అనేక ఆక్వా ప్రాసెస్ ప్లాంట్లు, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే వ్యర్థాలను సైతం ఈ నదిలోకే వదిలేస్తున్నారు. దీంతో దుర్గంధంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

బ్రిటీష్ హయాంలో కోరంగి వద్ద ప్రముఖ ఓడరేవు ఉండడంతో దేశ, విదేశాల నుంచి సరకు రవాణా అయ్యేది. అంతటి చరిత్ర కలిగిన ఈ ఆత్రేయ గోదావరి నేడు కలుషిత జలాలతో కునారిల్లుతోంది. 1990వ దశకం నుంచి ఈ ప్రాంతంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందుతూ వచ్చింది. అప్పట్లో కేవలం ఒకటో, రెండో రొయ్యల కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉండేవి. అయితే గత 30 ఏళ్లలో ఆక్వా పరిశ్రమ బాగా విస్తరించడంతో ప్రస్తుతం అనేక కొనుగోలు కేంద్రాలతో పాటు రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్లు సైతం నిర్మించారు. ఆయా కేంద్రాలతో పాటు, ప్రాసెస్ ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థాలు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఆత్రేయ గోదావరిలోకి మళ్లించేస్తున్నారు. ఇంత జరుగుతున్న పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్వా వ్యర్థాలను కోరంగి నదిలో కలపకుండా చూడాలని, తప్పనిసరైతే శుద్ధి చేసిన నీటిని మాత్రమే విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.